andhrajyothy.com


శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.3 : కనిష్ఠం 19.5

ఆంధ్రజ్యోతి

నిజామాబాద్
జిల్లా వార్తలు

5

ఆదివారం 9 ఫిబ్రవరి 2025




నేటి ప్రజావాణి తాత్కాలిక వాయిదా

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతీ సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. శాసనమండలి ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

పీసీసీ కార్యవర్గంపై
నేతల ఉత్కంఠ!





- ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు లేదా ముగ్గురికి అవకాశం
- ముందస్తుగానే ప్రయత్నాలు చేసిన కాంగ్రెస్ పార్టీ నేతలు
- పీసీసీ కార్యవర్గం ప్రకటనతో పాటే డీసీసీ అధ్యక్షుల నియామకం!
- జిల్లా అధ్యక్ష పదవి ఎవరిని వరించేనో?

నిజామాబాద్, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పీసీసీ కార్యవర్గం కూర్పుపై ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతల్లో ఉత్కంఠ నెలకొంది. ఒకటి, రెండు రోజుల్లోనే పీసీసీ కార్యవర్గాన్ని ప్రకటించనుండటంతో సీనియర్ నేతలు చోటు కోసం ఎదురు చూస్తున్నారు. కార్పొరేషన్ చైర్మన్ పదవులు రాని వారికి పీసీసీ కార్యవర్గంలో చోటు కల్పించనుండటంతో ఉమ్మడి జిల్లాకు చెందిన నేతలు గడిచిన కొన్నిరోజులుగా ప్రయత్నాలు చేశారు. కార్యవర్గం కూర్పు దాదాపు ఖరారు కావడంతో ఎవరికి చోటు దక్కుతుందోనని ఎవరికి వారే అంచనాకు వస్తున్నారు. సీనియర్ నేతలను కలుస్తూ కార్యవర్గం కూర్పుపై తెలుసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. పీసీసీ కార్యవర్గానికి ఏఐసీసీ నేతలు ఓకే చెప్పడంతో ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు లేదా మూడునేతలకు ఈ దఫా అవకాశం వస్తుందని భావిస్తున్నారు. కార్పొరేషన్ చైర్మన్‌ల కోసం చివరి వరకు ప్రయత్నాలు చేసిన నేతలు కార్యవర్గంలోనైనా చోటు వస్తే చాలనే నిర్ణయానికి వచ్చారు. రాష్ట్రస్థాయి పీసీసీ కార్యవర్గంతోపాటు జిల్లా అధ్యక్షులను ప్రకటించనున్నారు. ఈ రెండు పదవులపై నేతలు ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం అధికారంలో ఉండటం వల్ల ఏ పదవులు వచ్చినా పనులు జరిగే అవకాశం ఉండటంతో ఎవరికి వారే ప్రయత్నాల్లో ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ పదవులు నేతలకు కీలకంగా మారనుండటంతో గట్టి ప్రయత్నాలను చేస్తున్నారు.

జిల్లా అధ్యక్షులు ఎవరో?

పీసీసీ కార్యవర్గం ప్రకటించిన వెంటనే జిల్లా అధ్యక్షులను కూడా ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలు దఫాలు రాష్ట్రస్థాయిలో చర్చించారు. జిల్లా నుంచి పీసీసీ అధ్యక్షుడు ఉండటంతో ఈ దఫా కూడా సామాజిక వర్గాల వారిగా అధ్యక్షుడి నియామకం కోసం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అందరినీ కలుపుకోవడంతోపాటు కార్యకలాపాలు బలంగా తీసుకు వెళ్లే వారికి అవకాశం ఇవ్వనున్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలో ఇద్దరు అధ్యక్షుడు కొనసాగుతున్నారు. నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మానాల మోహన్‌రెడ్డికి రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవి ఇచ్చారు. కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌కు ఇంకా పదవి రాలేదు. ఆయనకు పీసీసీ కార్యవర్గంలో కీలకపదవి దక్కే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఒకవేళ అవకాశం ఉంటే కార్పొరేషన్ పదవి కూడా ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. వచ్చేవి అన్నీ కీలకమైన ఎన్నికలే కావడంతో అన్నీ చూసి జిల్లా అధ్యక్షులను నియమించనున్నట్లు తెలుస్తోంది.

పదవులపై సీనియర్ల ఆశలు

పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ నియామకం తర్వాత పీసీసీ కార్యవర్గాన్ని నేటికీ నియమించలేదు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ జిల్లాకు చెందిన వ్యక్తి కావడంతో ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులతో పాటు అధికార ప్రతినిధులు, సంయుక్త కార్యదర్శుల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన వారికి అవకాశం వచ్చే అవకాశం ఉందని పార్టీ నేతలు ఆశలు పెట్టుకున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి కార్పొరేషన్ చైర్మన్లుగా ఏడుగురు ఉన్నారు. సీనియర్ నేతలకు కార్పొరేషన్ చైర్మన్‌లుగా అవకాశం కల్పించారు. ఉమ్మడి జిల్లా నుంచి మరికొంత మంది సీనియర్ నేతలు పదవుల కోసం ఎదురు చూసినా వారికి అవకాశం రాలేదు. ఉమ్మడి జిల్లా నుంచి ఎక్కువమంది కార్పొరేషన్ చైర్మన్లు ఉండటంతో కొత్తవారికి అవకాశం వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. వీరి పదవీకాలం అయ్యేంతవరకు వేచి చూడడం తప్ప సీనియర్‌లకు అవకాశం లేదు. అప్పటివరకు పీసీసీలో కీలక పదవులు చేపడితే తమకు అవకాశం వస్తుందని భావిస్తున్నారు. దానికి అనుగుణంగానే ప్రయత్నాలు కొనసాగించారు. ఉమ్మడి జిల్లాలో పార్టీ జిల్లా అధ్యక్షులను కూడా నూతనంగా నియమించడనుండటంతో రాష్ట్రస్థాయి పదవులకు పోటీ పెరిగింది. ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపాధ్యక్షులతో పాటు ఇతర పదవుల్లో ఒకరిద్దరికి అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తుంది. కార్పొరేషన్ చైర్మన్లుగా ఉన్న వారికి పీసీసీ (తరువాయి 8వ పేజీలో..)



ప్రమాద ఘంటికలు.. ఆ జాతీయ రహదారి

- రీచుల వద్ద ప్రమాదాలు
- ఆందోళనలో వాహనదారులు

.... వివరాలు 7లో

వైభవోపేతంగా అంకురార్పణ

డిచ్‌పల్లి, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖిల్లాడిచ్‌పల్లి గ్రామంలో సీతారామచంద్ర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏకాదశి శనివారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో అంకురార్పణ కార్యక్రమాన్ని వేదబ్రాహ్మణులు వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, రక్షాబంధం, నివేదన, హారతి మంత్రపుష్పం వంటి కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు సుమిత్‌శర్మ దేశ్‌పాండే ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు అంకురార్పణ కార్యక్రమానిక ఇతరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జంగం శాంతయ్య, ఆలయ కమిటీ డైరెక్టర్లు గడ్డం నర్సారెడ్డి, సున్నం పోశెట్టి, సూర మాధురి, ఆసది జితేందర్, విజయరామారావు, వీడీసీ కమిటీ ప్రతినిధులు సుదర్శన్, యాదగిరి, గ్రామస్థులు ఉన్నారు.

రేపు మంత్రుల రాక

బ్రహ్మోత్సవాల్లో భాగంగా చారిత్రాత్మకమైన ఖిల్లా డిచ్‌పల్లి రామాలయంలో ఉత్సవాల్లో పాల్గొనేందుకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో పాటు కళ్యాణ వేడుకల్లో పాల్గొనేందుకు టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, టూరిజం డెవలప్‌మెంట్ సంస్థ చైర్మన్ పట్వారి రమేష్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి హాజరవుతున్నట్లు దేవాలయ కమిటీ నిర్వాహకులు విలేకరులకు తెలిపారు. కల్యాణ వేడుకల్లో అతిథులుగా పాల్గొంటారని వారు తెలిపారు.



పూజలు చేస్తున్న పురోహితులు

ఎమ్మెల్సీ పోలింగ్ విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు: కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



మాట్లాడుతున్న కలెక్టర్



సమావేశంలో పాల్గొన్న అధికారులు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అధికారులు పూర్తి అప్రమత్తతతో ఉండాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పిలుపునిచ్చారు. నిజామాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని పీవోలు, ఏపీవోలు, ప్రిసైడింగ్ అధికారులకు న్యూ అంబేడ్కర్ భవన్‌లో శనివారం శిక్షణను ఇచ్చారు. ఈనెల 27న ఈ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ జరుగుతుందన్నారు. ఉద్యోగులు, అధికారులకు ఎలాంటి సందేహాలు ఉన్నా శిక్షణ తరగతుల్లోనే మాస్టర్ ట్రైనర్లను అడిగి నివృత్తి చేసుకోవాలని ఆయన అన్నారు. శిక్షణ తరగతుల్లో అన్ని అవగాహన వచ్చిన తర్వాత పూర్తిగా పారదర్శకంగా ఎన్నికలు జరిగే విధంగా చూడాలన్నారు. ఎన్నికల విధులేనని నిర్లక్ష్యంగా ఉండవద్దన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే శాసన మండలి ఎన్నికలు కొంత భిన్నంగా ఉంటాయని అన్నారు. బ్యాలెట్ పద్ధతిన జరిగే ఈ ఎన్నికలకు పోలింగ్ సమయంలో ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉందన్నారు. ఈ ఎన్నికల పోలింగ్ ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జరుగుతుందన్నారు. ఉద్యోగులు సమన్వయంతో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలన్నారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో గడువులోపు వచ్చే వారికి వరుస క్రమంలో టోకెన్‌లను అందించాలన్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత నిర్దేశించిన సూచనలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. ఎన్నికల పోలింగ్ ముందు రోజు ఈనెల 26న ఉదయం 8గంటలకు అందరూ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పోలింగ్ సామాగ్రి తీసుకోవడంతో పాటు బ్యాలెట్ బాక్సులను పరిశీలించాలన్నారు. అన్ని పోలింగ్‌కేంద్రాల్లో సెల్‌ఫోన్లకు అనుమతులు లేవన్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత బ్యాలెట్ బాక్సులను కరీంనగర్‌లోని రిసెప్షన్ సెంటర్‌కు పోలింగ్ ప్రిసైడింగ్ అధికారులే అప్పగించాలన్నారు. ఏజెంట్లు, ఓటర్లు ఏవైనా సందేహాలు లేవనెత్తుతే వారికి వివరించాలని కోరారు. ఈ శిక్షణలో ఆర్డీవో రాజేంద్రకుమార్, డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.



నగరంలో బీజేపీ కార్యాలయం వద్ద నాయకుల సంబరాలు

ఢిల్లీ విజయం మోదీకి అంకితం

- ఎంపీ ధర్మపురి అర్వింద్

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో బీజేపీ పార్టీ విజయం సాధించి నేపథ్యంలో ఈ విజయం మోదీకి అంకితమని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్ అన్నారు. తాను ఇన్‌చార్జిగా ఉండి ప్రచారం నిర్వహించిన ఆర్‌కేపురం, జంగిపుర నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేలుగా గెలుపొందిన బీజేపీ అభ్యర్థులు అనిల్‌శర్మ, తర్వేందర్ సింగ్‌లను ఆయన ఢిల్లీలో కలిసి సన్మానించారు. ఈ విజయన్ని ప్రధాని మోదీకి అంకితం ఇస్తున్నట్లు అర్వింద్ పేర్కొన్నారు.

ఢిల్లీ గెలుపుపై బీజేపీ సంబరాలు

సుభాష్‌నగర్: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు (తరువాయి 8వ పేజీలో..)



ఢిల్లీలో గెలిచిన ఎమ్మెల్యేను అభినందిస్తున్న ఎంపీ అర్వింద్

కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల
స్వీకరణకు బ్రేక్!



- ఎన్నికల కోడ్ వల్ల నిలిపివేసిన ప్రభుత్వం
- నిరాశగా వెనుదిరిగిన లబ్ధిదారులు
- పెండింగ్‌లో 30వేలకు పైగా నేమ్ యాడింగ్ దరఖాస్తులు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్‌కార్డుల కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులకు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. ప్రభుత్వం కొత్తరేషన్ కార్డులు, పేర్లను జతచేసుకునేందుకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రకటన ఇచ్చిన కొద్దిగంటల్లోనే ఎన్నికల కోడ్ ఉందని దరఖాస్తులు చేసే సైట్‌ను మూసివేయడంతో ఎంతో ఆశగా దరఖాస్తులు చేసుకునేందుకు వచ్చిన లబ్ధిదారులు నిరాశతో వెనుదిరిగారు. మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వగా అనేకమంది శనివారం ఉదయం నుంచి మీసేవా కేంద్రాలకు తరలివెళ్లారు. కానీ రాష్ట్రంలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో మళ్లీ ప్రభుత్వం దరఖాస్తుల ప్రక్రియకు బ్రేక్ వేసింది. దీంతో ఎన్నో సంవత్సరాలుగా కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులు మళ్లీ నిరాశతో వెనుది రగాల్సిన పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో కొన్ని కొత్త రేషన్ కార్డులు మాత్రమే ఇవ్వగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా అర్హులకు రేషన్‌కార్డులు ఇస్తామని ప్రకటించింది. గత 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రజాపాలన పేరుతో కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. జిల్లాలో వేలాది సంఖ్యలో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు వచ్చాయి. ప్రజాపాలన కార్యక్రమం అనంతరం రేషన్‌కార్డుల జారీకి ప్రభుత్వం ప్రయత్నాలు చేసినప్పటికీ పార్లమెంట్ ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియకు బ్రేక్ పడింది. మళ్లీ పార్లమెంట్ ఎన్నికల అనంతరం కొత్త రేషన్‌కార్డుల కోసం లబ్ధిదారులు ఎదురు చూసినప్పటికీ నిరాశ తప్పలేదు. మళ్లీ ప్రభుత్వం ఇటీవల జనవరి 26వ తేదీన ఆహార భద్రత కార్డుల జారీ కోసం నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ప్రభుత్వం గ్రామసభలను నిర్వహించి రేషన్‌కార్డుల కోసం లబ్ధిదారులను ఎంపిక చేసింది. గ్రామసభలలో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నవారి పేర్లను ప్రకటించడంతోపాటు ఇంకా ఎవరైనా జాబితాలో పేరు లేనివారు దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రభుత్వం తెలిపింది. రేషన్‌కార్డులలో కొత్తగా కుటుంబ సభ్యుల పేర్లను జత చేసేందుకు సైతం ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. ఇప్పటికే గ్రామసభలలో రేషన్‌కార్డుల కోసం ఎంపికైన వారిపేర్లను ప్రకటించగా ఇంకా చాలా మంది రేషన్‌కార్డుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం శుక్రవారం మీసేవాల ద్వారా రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రకటన ఇచ్చిన నేపథ్యంలో శనివారం జిల్లాలోని మీసేవా కేంద్రాల్లో లబ్ధిదారులు బారులు తీరారు. తీరా వెబ్‌సైట్‌ను క్లోజ్ చేయడంతో లబ్ధి దారులు నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జిల్లాలో 3,80,048 ఆహార భద్రత కార్డులు

జిల్లాలో 3లక్షల 80వేల 48 ఆహార భద్రతకార్డుల ద్వారా ఇప్పటికే 12లక్షల 25,008మంది లబ్ధిదారులకు అంత్యోదయ, అన్నపూర్ణకార్డుల ద్వారా లబ్ధిదారులకు రేషన్ అందజేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 759 రేషన్‌దుకాణాల ద్వారా రేషన్ సరకుల పంపిణీ కొనసాగుతోంది. జిల్లాలో అంత్యోదయ కార్డులు 20961 ఉండగా 56వేల 922 మందికి, 1034 అన్నపూర్ణకార్డుల ద్వారా 1057 మంది లబ్ధిదారులకు రేషన్ బియ్యం అందజేస్తున్నారు. వీరికి ప్రతీనెల ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున, అన్నపూర్ణ కార్డుదారులకు 10 కిలోలు, అంత్యోదయ కార్డు దారులకు ప్రతీనెల 35కిలోల బియ్యాన్ని అందజేస్తున్నారు.

ఫ్యామిలీ మెంబర్ యాడింగ్ దరఖాస్తులు 27,427 పెండింగ్

జిల్లాలో. ప్రస్తుతం 3లక్షలకు పైగా ఉన్న రేషన్‌కార్డులలో సవరణలు, కుటుంబ సభ్యులను చేర్చడానికి లబ్ధిదారులు చే సుకున్న దరఖాస్తులు 27,427 పెండింగ్‌లో ఉన్నాయి. అధికా రులు చెబుతున్న లెక్కల ప్రకారం 27వేలే ఉన్నప్పటికీ ఇంకా సంఖ్య (తరువాయి 8వ పేజీలో..)

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు పంపిణీ



చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏర్గట్ల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలో శనివారం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.56 వేల చెక్కును లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు అందజేశారు. చెక్కుమంజూరుకు కృషిచేసిన బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పన్నాల నర్సారెడ్డి, గడ్డం జీవన్, మినుముల సాగర్, స్వామి, రాజు, శ్రీధర్‌లు పాల్గొన్నారు.

విప్లవ ఉద్యమాలకు యాదగిరి పునాదులు వేశారు



సభలో మాట్లాడుతున్న బి.దేవరాం

మోర్తాడ్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విప్లవోద్యమ నిర్మాణానికి పునాదులు వేసిన మార్క్సిస్టు లెనినిస్టు కామ్రేడ్ కట్టెల యాదగిరి ... డివిజన్ కార్యదర్శి బి.దేవరాం అన్నారు. శనివారం మోర్తాడ్‌లో కట్టెల యాదగిరి సంస్మరణ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవరాం మాట్లాడుతూ జిల్లాలో అనేక మంది కార్యకర్తలను తీర్చిదిద్ది అందరికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సురేష్, శర్మ, డివిజన్ నాయకులు కిషన్, అశోక్, ప్రజాసంఘాల నాయకులు దయాలసింగ్, దశరథ్, పద్మ, రాజన్న, అంజలి ఉన్నారు.

బాధితులకు చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు

ముప్కాల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల కేంద్రంలో బాధిత కుటుంబాలకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మన్ను భూమేశ్వర్ ఆరుగురు బాధిత కుటుంబాలకు చెక్కులను అందజేశారు. చెక్కులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సామ వెంకటరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గడ్డల రమేష్, ఏలేటి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఒలంపియాడ్‌కు విద్యార్థుల ఎంపిక



ఒలంపియాడ్‌కు ఎంపికైన విద్యార్థులు

ముప్కాల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గత నెల 8వ తేదీన నిర్వహించిన రాష్ట్రస్థాయి ఒలంపియాడ్‌లో ముప్కాల్ న్యూహరిజోన్ పాఠశాలకు చెందిన 21 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో జాతీయస్థాయికి ఎంపికైనట్లు న్యూహరిజోన్ పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రవిలాస్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పాఠశాల విద్యార్థులను కరస్పాండెంట్ రత్నాకర్, ఉపాధ్యాయులు అభినందించారు.

నలంద పాఠశాలలో విద్యార్థులకు వీడ్కోలు

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో గల నలంద హైస్కూల్‌లో శనివారం పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ప్రసాద్, ప్రిన్సిపాల్ సాగర్ మాట్లాడుతూ పట్టుదలతో చదివి పదోతరగతిలో 10 జీపీఏ సాధనకు కృషిచేయాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో నడుచుకొని చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం విద్యార్థిని విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించిన విద్యార్థులను అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బోధన్‌రూరల్,ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నామని బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గ్రామాల నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సిస్టేషన్‌కు తరలించామన్నారు. కేసు నమోదు చేశామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముప్కాల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : కుటుంబసమస్యల కారణంగా జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బాల్కొండలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాల్కొండ మండల కేంద్రానికి చెందిన వేంపల్లి కృష్ణ అలియాస్ నర్సయ్య(46) శుక్రవారం తన వ్యవసాయ తోటలో వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం నర్సయ్యను నిజామాబాద్ ఆసుపత్రికి తరలించగా గత 11 గంటలకు చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

తొర్లికొండలో వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు



తొర్లికొండలో స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తొర్లికొండలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ఉత్సవాలను శనివారం భక్తులు, గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. కొండపైకి చేరుకున్న భక్తులు స్వామివారి పల్లకిని ప్రదక్షిణ చేయించారు. కొండపై స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అన్నదానం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

దేశానికి విత్తనాలు అందించాలి

● రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్

వేల్పూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంతం విత్తనోత్పత్తికి అనుకూలమైన వాతావరణం ఉందని, దేశానికి విత్తనాలు అందించే విధంగా పోటీపడాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. శనివారం వేల్పూర్ మండలం విత్తన ధృవీకరణ కార్యాలయంలో విత్తన ధృవీకరణ, సేంద్రీయ ధృవీకరణపై రైతులకు, విత్తనోత్పత్తిదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు వివిధ పంటల ఉత్పత్తిలో పాటించాల్సిన మెళకువలను వివరించడంతో ధృవీకరించబడిన విత్తనాల వినియోగం ద్వారా అధిక దిగుబడి పొందాలని సూచించారు. రాష్ట్రంలో విత్తనాలు తయారు చేసి అందిస్తున్న ఆ విత్తనాలు ప్రభుత్వ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా ధృవీకరించబడినా లేదా అన్న విషయాన్ని రైతులు తెలుసుకొని కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ విత్తన ధృవీకరణ, సేంద్రీయ ధృవీకరణ అథారిటీ డైరెక్టర్ డాక్టర్ కేశవులు, బోర్డు సభ్యులు కొక్కం మురళి, రాంచందర్, బోర్డు మాజీసభ్యులు సంజీవరెడ్డి, యూనివర్సిటీ సైంటిస్టులు డాక్టర్ రాజేందర్‌రెడ్డి, విజయకుమార్, రైతులు పాల్గొన్నారు.

సాంకేతిక రంగాల్లో రాణించాలి

● బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న బోధన్ సబ్‌కలెక్టర్

బోధన్‌రూరల్,ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక రంగాలలో రాణించాలని బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. శనివారం సాలూర మండల కేంద్రంలోని ప్రజ్ఞశ్రీ పాఠశాల సిల్వర్‌జూబ్లీ కార్యక్రమంలో పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి చిన్నతనంలో చదివి మంచి ర్యాంకులు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిపేరు తెచ్చి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కొడాలి కిషోర్, విద్యాధికారి శ్రీనివాస్, జిల్లెల శంకర్, సాలూర మండల విద్యాశాఖ అధికారి రాజీ మంజుష, బోధన్ మండల విద్యాశాఖ అధికారి నాగయ్య, లోలం శంకర్, తహసీల్దార్ శశిభూషణ్, పాఠశాల యాజమాన్యం రాజు విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి జాతర ఉత్సవాలు

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 8 : (ఆంధ్రజ్యోతి) కమ్మర్‌పల్లి శ్రీగిరి గుట్టపై కొలువదీరిన కాలజ్ఞాని శ్రీమద్ విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి జాతర ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉత్సవమూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పల్లకి ఊరేగింపు గ్రామకమిటీ సభ్యులు గ్రామంలో ఊరేగిస్తూ జంబిహనుమాన్ ఆలయం వద్ద గల శ్రీగిరి గుట్టపైకి బ్రహ్మంగారి ఆలయానికి చేర్చారు. గ్రామ మహిళలు మంగళహారతులతో ముందు నడవగా మేళతాళాలు, మంగళవాయిద్యాలతో పల్లకి ఊరేగింపు నిర్వహించారు.

విజయ్ ఫార్మసి విద్యార్థినికి మూడుస్వర్ణ పతకాలు

మాక్లూర్, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాణిక్‌బండార్ గ్రామ శివారులో గల విజయ్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీకి చెందిన విద్యార్థిని జేఎన్‌టీయూ 13వ స్నాతకోత్సవంలో భాగంగా విద్యార్థిని బొల్లిబత్తులక్ష్మి మూడు స్వర్ణ పతకాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్ తెలిపారు. జేఎన్‌టీయూ బెస్ట్ కళాశాల అన్నింటిలో ఉత్తమ బెటొగ్గొయింగ్, బీఫార్మసి అవార్డు, బీఫార్మసి కోర్సులో ఒకటోర్యాంకు సాధించి సాధాన్ ఎండోమెంట్ గోల్డ్‌మెడల్, విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలలో ఉత్తమ బెటొగ్గొయింగ్ బీఫార్మసి విద్యార్థిగా డాక్టర్ అంధ్యానాయుడు ఎండోమెంట్ గోల్డ్‌మెడల్ సాధించారు. అత్యుత్తమ విజయ సాధన అంతిమంగా మూడుగోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థినికి కళాశాల చైర్మన్ నరేందర్‌రెడ్డి, కార్యదర్శి అమృతలత విద్యార్థులు అభినందించారు.

తడిపొడి చెత్తపై విద్యార్థులకు అవగాహన

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మున్సిపల్ సిబ్బంది శనివారం తడిపొడి చెత్తపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మున్సిపల్ పరిధిలో ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దుకోవడానికి ప్రతీఒక్కరు సహకరించాలని మున్సిపల్ అధికారులు కోరారు. అలాగే వీధికుక్కలతో జాగ్రత్తగా ఉండాలని, వాటితో ఏలా వ్యవహరించాలో విద్యార్థులకు అవ గాహన కల్పించి వాటి జనాభా నియంత్రణకు ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌కు తరలిస్తున్నామని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సానిటరి ఇన్‌స్పెక్టర్ గజానంద్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ పూర్ణకోత్, ప్రధానోపాధ్యాయుడు ఎ.శ్రీనివాస్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ



పరీక్షప్యాడ్‌లతో విద్యార్థినులు

కోటగిరి, ఫిబ్రవరి 08 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎత్తొండ జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ శశాంక్ కోరెం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లతో పాటు ఇతర సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అలివేలు, ఉపాధ్యాయులు అజయ్, నవీన్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల సమస్యలు పరిష్కరిస్తాం

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ ఉమ్మడి నాలుగు జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి వూట్కూరి నరేందర్ రెడ్డి అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని మహాలక్ష్మి కళ్యాణ మండపంలో ప్రైవేటు కళాశాల, పాఠశాలల టీచర్లతో సమావేశం నిర్వహించారు.

ఆర్మూర్‌రూరల్ : ఉపాధ్యాయ పట్టభద్రుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో మొదటి సారి ఆయన ప్రచారం నిర్వహించారు.

పచ్చలనడ్కుడలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

వేల్పూర్, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామంలో శనివారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు బలహీనవర్గాల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను చేపడుతున్నారు. పేదలు అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన వారికి సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందజేయడం గొప్పవరమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు గుడాల మోహన్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బద్దెంగి గంగాధర్, నాయకులు గట్టుపాకల నర్సారెడ్డి, నెహ్రూ, మోహన్, మండల భోజన్న, లింగేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియ కళాశాలలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చేపూర్ క్షత్రియ కళాశాలలో శనివారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్ మాట్లాడుతూ పూర్వవిద్యార్థులు కళాశాలకు వెన్నుముక లాంటివారని, వారి పనితీరుపై పేరుప్రతిష్టలు ఆధారపడి ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శంకర్ చాటర్జీ, గడ్డిపాటి శ్రీనివాస్, రామసావిత్రి, లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ ఆదికిపెండి, కో-ఆర్డినేటర్ కిరణ్‌కుమార్, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోను సన్మానించిన కలెక్టర్



ఎంఈవో శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న అధికారులు

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి) నిజామాబాద్ కలెక్టరేట్‌లో జరిగిన అపార్ ఐడీ జనరేషన్ అంశంపై జరిగిన జిల్లా ప్రధానోపాధ్యాయుల సమావేశంలో జక్రాన్‌పల్లి ఎంఈవో శ్రీనివాస్‌ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఘనంగా సన్మానించారు. జిల్లాలో అపార్ ఐడీ జనరేషన్ 67 శాతం పూర్తి చేసిన సందర్భంగా ఎంఈవో శ్రీనివాస్‌ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు సత్కరించారు. కార్యక్రమంలో మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడు గోపి, ప్రధానకార్యదర్శి రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంకాపూర్‌లో వ్యక్తి అనుమానాస్పద మృతి

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాపూర్‌లో సంపంగి నర్సయ్య (41) అనే వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందాడు. స్థానికులు తెలిపిన ప్రకారం శుక్రవారం రాత్రి భోజనం చేసి నిద్రించిన నర్సయ్య ఉదయం లేవకపోవడంతో మృతిచెందినట్లు గుర్తించి తమ్ముడు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ హెచ్‌వో సత్యనారాయణ, ఎస్ఐ గోవింద్ సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థులు పదిపరీక్షలు అంటే భయపడవద్దు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పది పరీక్షలు అంటే భయపడవద్దని ఇష్టంతో చదివితే ఉత్తమ ర్యాంకులు సాధించవచ్చని మాతృశ్రీ విద్యాసంస్థల డైరెక్టర్ దినకర్ అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని మాతృశ్రీ విద్యాసంస్థల పదోతరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిప్రజ్వలన అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థులు పరీక్షలు అంటే భయపడవద్దని, ఇష్టంతో పరీక్షలు రాసి ఉత్తమ ర్యాంకులు సాధించవచ్చన్నారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షులు కిషోర్‌కుమార్, విద్యాధికారి శ్రీనివాస్, పులాత్ అజయ్, మాతృశ్రీ సుభాష్‌తో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని బీహెచ్‌ఎమ్మెస్ జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ స్వప్న అన్నారు. శనివారం బోధన్ మండలంలోని అమ్దాపూర్‌లో గల కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిశు, భ్రూణహత్యల గురించి, ఆడపిల్లలపై జరిగే అఘాయిత్యాల గురించి వివరించారు. ఆడపిల్లలపై అఘాయిత్యాలు జరగకుండా వాటిని తగ్గించడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. చిన్న వయస్సులోనే పెళ్లిళ్లు చేయడం సరికాదని, 18 సంవత్సరాలు పూర్తయిన తర్వాతనే ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయాలని, నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల నష్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోవిలక్ష్మి, ప్రిన్సిపాల్ హిమబిందు, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యార్థినులు రాణించాలి

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణతో విద్యార్థినులు చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించాలని సాలూర మండల విద్యాశాఖ అధికారి రాజీ మంజుష అన్నారు. శనివారం సాలూర ప్రభుత్వ పాఠశాలలో బాలిక సాధికారిత, ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. జీవితం కాలంలో సైబరనేరాలు పెరిగిపోయిన వాటిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆర్థిక మోసాల నుంచి ఎలా తప్పుకోవాలో వివరించారు. మోసపూరిత ఫోన్ కాల్స్‌కు భయపడవద్దని, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికి తెలియజేయవద్దన్నారు. ఫోన్‌లకు వచ్చే ఓటీపీలు, మెసేజ్‌లు ఎవరికి చెప్పవద్దన్నారు. విద్యార్థి దశలో ఇవి అలవర్చుకుంటే భవిష్యత్ తరం ఎలాంటి తప్పులు చేయకుండా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు భూమయ్య, ఉపాధ్యాయులు విజయకుమార్, విజయలక్ష్మి, శోభారాణి, అరుణ్ కుమార్, విఠల్ కాంబ్లే, లక్ష్మి, అంజనా, వనజ, సాయిలున్నారు.

విధుల్లో చేరిన మధ్యాహ్నభోజన కార్మికులు

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం మగ్గిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నభోజన కార్మికులు తిరిగి యథావిధిగా విధుల్లో చేరారు. కొంతకాలంగా మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించడంతో వారు నిరసన కార్యక్రమం చేపట్టి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నాయకులు పల్లపు వెంకటేష్, కుతాడి ఎల్లయ్య, అధికారులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషిచేశారు. సోమవారం నుంచి యథావిధిగా విధుల్లో చేరాలని భోజన కార్మికులకు అధికారులు సూచించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జక్కుల సుజాత, అశోక్, హసీన పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భక్తులు సహకరించాలి

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల కేంద్రంలో నిర్మించనున్న వెయ్యి నామాల శ్రీవేంకటేశ్వరస్వామి నూతన ఆలయ నిర్మాణానికి భక్తులు సహకరించాలని కేదార్నాథ్ ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీ మంగిరాములు మహరాజ్ అన్నారు. శనివారం ఆలూర్‌లో శ్రీవేంకటేశ్వర స్వామి గుట్ట వద్ద ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేసిన స్థలంలో మంగిరాములు మహారాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగిరాములు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఈ క్షేత్రం దేదీప్యమానంగా వెలుగొందాలని ఆకాంక్షించారు. భక్తులు తమకు తోచిన విధంగా ఆలయ నిర్మాణానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, తెర్ల మల్లేష్, స్వామి, గ్రామస్థులు పాల్గొన్నారు.

నాళేశ్వర్‌లో విగ్రహప్రతిష్ఠాపన ఉత్సవాలు

నవీపేట,ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్‌లో శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన సహిత, ధ్వజస్తంభ, పోచమ్మ దేవి ఆలయాల శిఖర ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలలో భాగంగా మొదటి రోజైన శనివారం విగ్రహాల ఊరేగింపు, ధ్వజారోహణం, గణపతి పూజ, పుణ్యాహవచనం, గోపూజ, అఖండ దీప స్థాపనము, యాగశాల ప్రవేశము, అగ్ని ప్రతిష్ఠ, నవగ్రహ యోగిని, వాస్తు, క్షేత్రపాల, సర్వతోభద్ర, మండల దేవతా స్థాపన పూజ, జలాధివాసం, ప్రదోషకాల పూజ, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా చివరి రోజైన సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నారు.

కార్మికులకు ఆదివారం సెలవు ఇవ్వాలి

వర్ని, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య కార్మికులకు ఆదివారం సెలవు ఇవ్వకుండా పనులు చేయించడం చట్ట విరుద్ధమని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్ డిమాండ్ చేశారు. శనివారం వర్ని మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికుల మండల స్థాయి సమావేశం రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జంగం గంగాధర్ మాట్లాడుతూ గ్రామాల్లో కార్మికులకు తక్షణ వేతనాలు ఇచ్చి అధికారులు పనులు చేయిస్తున్నారని ఆయన మండిపడ్డారు.

ఎన్ఎస్ఎఫ్ భూములను రిజిస్ట్రేషన్ చేయాలి

సాలూర, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వివిధ కార్పొరేషన్‌ల ద్వారా నిరుపేద లబ్ధిదారులకు ప్రభుత్వం భూములు కొనుగోలు పథకం కింద కేటాయించిన భూములను రిజిస్ట్రేషన్ చేసి న్యాయం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంపల్లి ఎల్లయ్య అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని తాలూకా క్లబ్‌లో ఆవో సియేషన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ కార్పొరేషన్‌ల ద్వారా గతంలో లబ్ధిదారులు వారికి భూపంపిణీ పథకంలో అందించిన ఎన్ఎస్ఎఫ్ భూములను రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మిర్జాపూర్ సాయన్న, బాలరాజ్, సాయిలు, అబ్బయ్య, ప్రసాద్‌లున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

బీజేపీ సంబరాలు



రుద్రూర్‌లో సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

రుద్రూర్, ఫిబ్రవరి 08 (ఆంధ్రజ్యోతి) : నరేంద్ర మోదీ ప్రభుత్వ పథకాలే బీజేపీ పార్టీని గెలిపించాయని రుద్రూర్ మండల అధ్యక్షుడు ఆలంపాటి హరికృష్ణ అన్నారు. ఢిల్లీలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ గెలుపొందిన సందర్భంగా శనివారం రుద్రూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు ఆలంపాటి హరికృష్ణ ఆధ్వర్యంలో బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వీట్లు పంచుతూ ఘనంగా విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ.. 27 ఏళ్ల తర్వాత భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఏముల గజేందర్, ప్రశాంత్ గౌడ్, కటికె రామరాజ్, వడ్ల సాయినాథ్, కమ్మరి గణేష్, శంకర్ పటేల్, బీజేపీ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట : భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో సంబరాలు జరిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజేందర్ గౌడ్, బందెల ఆనంద్, నాగభూషణ్, గణేష్, రాము, బాల గంగాధర్, భూషణ్, ప్రవీణ్, సాయినాథ్‌లున్నారు.

కోటగిరి :మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. కోటగిరి మండల కేంద్రంలో శనివారం పాత బస్టాండ్ వద్ద టపాకాయలు కాలుస్తూ సంబరాలు నిర్వహించారు. అనంతరం స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నవీన్, మోహన్ రావు, అవగిరి రావు, శ్రీనివాస్, శ్యామల, సాయిలు పాల్గొన్నారు. పోతంగల్ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు శనివారం సంబరాలు నిర్వహించారు.

ఆర్మూర్‌టౌన్ : పట్టణంలోని అంబేడ్కర్‌చౌరస్తాలో శనివారం బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, ఆసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మందుల బాలు, బొట్ల వినయ్, వీరప్రసాద్ పాల్గొన్నారు.

భీమ్‌గల్ : ఢిల్లీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పార్టీ విజయఢంకా మోగించడంతో మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం భీమ్‌గల్ పట్టణంలో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. బడాభీమ్‌గల్‌చౌరస్తా నుండి బస్టాండ్ వరకు ర్యాలీగా వచ్చి బీజేపీ నాయకులు టపాకాయలు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు యోగేశ్వర్ నర్సయ్య, ఆరే రవీందర్, సుధాకర్, మహిపాల్ పాల్గొన్నారు.

మోర్తాడ్ : మండల కేంద్రంలో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో శనివారం బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల నరేష్, మండల ఉపాధ్యక్షుడు కుంట శ్రీనివాస్‌రెడ్డి, జై గంగారెడ్డి, కోరం ప్రకాశ్, చిన్నారెడ్డి, లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్ : ముప్కాల్, బాల్కొండ మండలాల్లో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం బీజేపీ నాయకులు టపాకాయలు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మెండోర : బీజేపీ నాయకులు టపాకాయలు కాల్చి స్వీట్లు పంచుకొని సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారు మత్యంరెడ్డి, నోముల రవి, పురుషోత్తం, సాయిలు, ప్రసాద్, నరేష్, సంతోష్, సాగర్, అనిల్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్ : ఢిల్లీరాజ్యాలో బీజేపీ తెలంగాణలోనూ అధికారంలోకి వస్తుందని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి సుధాకర్‌చారి అన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కోలిపాక బాలరాజు, బీజేపీ మాజీ కౌన్సిలర్ పద్మ పాల్గొన్నారు.

ఎడపల్లి : మండల బీజేపీ ఆధ్వర్యంలో టపాకాయలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు కట్కం అరుణ్, నిశాంత్, ప్రకాష్ ఉన్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

● కాలిపోయిన లైట్లు



స్తంభం నుంచి ఇంటి వరకు ఏర్పాటు చేసిన వైరు

మోస్రా, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): చందూర్ మండల కేంద్రంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే చందూర్ మండల కేంద్రంలో నివాసం ఉంటున్న అర్కల గోపాలరెడ్డి ఇంట్లో విద్యుత్ సదుపాయం కొరకు అధికారులను కోరగా స్తంభం నుండి ఇంట్లో మీటరుకు వైరు పెట్టగా సదుపాయం పెట్టిన వ్యక్తి రెండు వైర్లను ఫేస్ నూటల్ పెట్టకుండా రెండు ఫేస్ కనెక్షన్ పెట్టగా ఇంట్లో ఫ్యూజ్ కాలిపోగా ఉన్న బల్బులు అన్ని కాలిపోయాయని బాధితుడు గోపాల్‌రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా విద్యుత్ శాఖ వారికి పలుమార్లు ఫోన్ చేసిన సమాధానం చెప్పలేదని చివరికి గ్రామస్థులు ఆగ్రహించి పై అధికారికి తెలుపగా వచ్చారని గ్రామస్థులు తెలిపారు.

● సమస్య పరిష్కారం చేశాం

గ్రామస్థులు సమస్య తెలియపర్చగానే లైన్ ఇన్స్‌సజ్పెక్టర్‌ను పంపి ముందు సమస్య పరిష్కారం చేశామని ఏఈ గోవింద్ తెలిపారు.



ఆందోళన చేస్తున్న గ్రామస్థులు



బ్రాహ్మణపల్లి బస్‌స్టేషన్ వద్ద ప్రమాదానికి గురైన కారు (ఫైల్)



బ్రాహ్మణపల్లి శివారులో ఉన్న జాతీయ రహదారి ఇదే



రహదారి సైడ్ వద్ద రీలింగ్ నిర్మాణం చేయని దృశ్యం

ప్రమాదానికి పిలుపు.. ఆ జాతీయ రహదారి

● రీచ్‌ల వద్ద తరచూ ప్రమాదాలు
● ఆందోళనలో వాహనదారులు

నిజాంసాగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్‌ఏ 161 రహదారి వెంట ఉన్న రీచ్‌లు ప్రమాదం ఘంటికలుగా మారాయి. ఈ రీచ్‌ల వద్ద తరచుగా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో రహదారి వెంటనే వెళ్లే వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. 161 ఎన్‌హెచ్‌ఏ రహదారి కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం బ్రాహ్మణపల్లి శివారు నుంచి నర్సింగరావుపల్లి శివారులోని నల్లవాగు మత్తడి, ఎడమ కాలువ వరకు ఉన్న రీచ్‌లా సైడ్ బారములు అధ్వానంగా మారడంతో తరచుగా లారీలు, కార్లు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ ప్రమాదాల్లో ప్రాణాలు గాల్లో కలుస్తున్నప్పటికీ ఎన్‌హెచ్‌ఏ అధికార యంత్రాంగం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుంది. బ్రాహ్మణపల్లి శివారులో నుంచి నర్సింగ్‌రావుపల్లి కూడలి వరకు ఎడమ వైపు మలుపులు ప్రమాదకరంగా ఉన్నప్పటికీ అధికారులు రీలింగ్ నిర్మాణాలు చేపట్టలేకపోవడంతో ప్రమాదాలు నిలయంగా మారాయి. బ్రాహ్మణపల్లి హనుమాన్ మందిరం నుంచి కేతకి రైస్‌మిల్లు వరకు ఉన్న వంపుల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రీచ్‌ల వద్ద హెచ్చరిక బోర్డను కూడా ఏర్పాటు చేయకపోవడం పట్ల సర్వత నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ రహదారి వెంట ఉన్న రీచ్‌లు ప్రమాదం గంటిగా ఉన్నప్పటికీ అధికార యంత్రంగాం ఏనాడు కూడా ఈ రీచ్‌ల వద్ద జరుగుతున్న ప్రమాదాల ఆరా తీయకపోవడం విశేషం. ఇదిలా ఉండగా బ్రాహ్మణపల్లి, మంగళూరు అచ్చంపేట గ్రామాలకు వెళ్లే రహదారికి యూ టర్న్ నిర్మాణం చేపట్టకపోవడంతో ఈ గ్రామాలకు వెళ్లే వాహనదారులు, ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏ గ్రామాలకు యూ టర్న్ నిర్మాణాలు చేపట్టాలని ఎన్‌హెచ్‌ఏ అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా సంబంధిత రహదారి అధికార యంత్రాంగం స్పందించి ఆ రీచ్‌ల వద్ద రైలింగ్ నిర్మాణాలతో పాటు గ్రామాలకు యూ టర్న్ నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సాగు నీరందక రైతన్న కంట కన్నీరు

● మిర్జాపూర్‌లో ఎండుతున్న పంట పొలాలు ● చెరువు కింద పంట పొలాల రైతుల ఆవేదన
● పంట పొలాలను కాపాడాలని వేడుకోలు

జర దేఖో!!



మిర్జాపూర్‌లో ఎండిపోయిన పొలాలను చూపిస్తున్న రైతులు

నసురుల్లాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్ర జ్యోతి): మండలంలో మిర్జాపూర్ గ్రామంలో పంట పొలాలను సరైన సమయంలో నీరు అందక పంట పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉప కాలువ నీరందక గ్రామంలో ఇంచుమించు 200 ఎకరాలు వరి పంట ఎండి పోయిందని, ఆయకట్టు రైతులు వాపోతున్నారు. నిజాంసాగర్ నీటిని మండలంలోని 25వ నెంబర్ ఉప కాలువ ద్వారా నీటిని వదిలి చెరువుని నింపితే తమ కష్టాలు తీరుతాయని రైతులు చెబుతున్నారు. ఉప కాలువ నీరందక పంటలు ఎండి పోతున్నాయని, తమ గోడును వెళ్లబుచ్చుకున్నారు. ఇదే విషయం స్థానిక నాయకులు, సంబంధిత అధికారులకు సంప్రదించగా ఈ విషయం తమకు సంబంధం లేదని, పంట కాలువ వద్ద నీళ్ల కోసం కాపలా కాసి నీటిని కాపాడుకోవాలని, స్థానిక తహసీల్దార్ తెలిపినట్లు రైతులు వాపోతున్నారు. చెరువులో పూర్తిగా నీరు లేకపోవడంతో తూముకు నీరు అందక వరి పంట పూర్తిగా ఎండి పోయిందని వేల రూపాయలు పెట్టుబడి పెట్టి వరిపంట పండించు కోవాలన్న సమయంలో పంటకు నీరందక పంట పొలాలు ఎండిపోతున్నాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, నాయకులు స్పందించి ఎండిపోయిన పంటకు నీరు అందేలా చూడాలన్నారు.

● నిజాంసాగర్ నీటిని నింపి రైతులను ఆదుకోవాలి



చివరి ఆయకట్టుకు నీరందేలా అధికారులు చర్యలు చేపట్టి ఎండిపోయిన పంటలను కాపాడాలి.

● శంకరప్ప, రైతు మిర్జాపూర్

● నీరందక పంటలు ఎండిపోతున్నాయి..



చెరువు కింది పంట పొలాలు నీరు అందక ఎండిపోతుఅన్నయని, అధికారులు స్పందించిన నీటిని వదిలిపెట్టి మా పంటలను కాపాడాలి.

●జంగలి శ్రీనివాస్, రైతు



అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం

కూనీపూర్‌లో వైభవంగా అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

వర్ని, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వర్ని మండలం కూనిపూర్ గ్రామంలో శనివారం శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయ నిర్మాణం కోసం ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా మండపేటకు చెందిన పెనుమర్తి ప్రహ్లాద(నల్లూరి) ఒక ఎకరం భూమితో పాటు మూడు లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. బొమ్మారెడ్డి గోపాల్ రెడ్డి ధ్వజస్తంభంకు దాతగా నిలిచారు. మొదటి రోజులో భాగంగా శాతి శుక్ల పఠనం, మూగణాధిపతి పూజ, స్వస్తి పుణ్యవచనం, రక్షాబంధనం, పంచగవ్య గోపూజ, యాగ ప్రవేశం నిర్వహించారు. వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. వందలాది మందికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తుల హారతులు, పూజల మధ్య విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. వేడుకల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు గ్రామ ప్రజలు, నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



హారతులతో మహిళలు

బీఈడీ కళాశాలలో ఫీజు దోపిడీని అరికట్టాలి



మాట్లాడుతున్న ఏబీవీపీ వర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అధిక ఫీజులు వసూలు చేస్తున్న బీఈడీ కళాశాలలపై యూనివర్సిటీ వైస్‌చాన్సిలర్, రిజిస్ట్రార్‌లు స్పందించి చర్యలు తీసుకొని అఫిలియేషన్ రద్దు చేయాలని ఏబీవీపీ వర్సిటీ అధ్యక్షుడు సాయి కుమార్ డిమాండ్ చేశారు. శనివారం వర్సిటీలోని కళాశాల వద్ద విలేకరులతో మాట్లాడుతూ వర్సిటీ పరిధిలో కొనసాగుతున్న బీఈడీ కళాశాలలు విద్య పేరు మీద వ్యాపారం చేస్తున్నాయని నాణ్యమైన విద్యాబోధన అందించాల్సిన కళాశాలలు ధనార్జనే ధ్యేయంగా నడుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్సిటీ ఎగ్జామ్‌బ్రాంచ్ నిర్వహించిన మూడో సెమిస్టర్ ఫీజు రూ.1490, బీఈడీ కళాశాలలో 3 నుంచి 4వేల వరకు అక్రమంగా పేద విద్యార్థుల దగ్గర ముక్కు పిండి వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలల అఫిలియేషన్ ఫీజు రిసిప్ట్ ఇవ్వకుండా ఖాళీ తెల్లపేపర్ మీద ఎగ్జామ్ ఫీజు పేరు మీద, ప్రాక్టికల్ పేరు మీద అడ్డూ అదుపు లేకుండా డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రశ్నించిన విద్యార్థులను బెదిరిస్తూ ప్రాక్టికల్‌లో ఫెయిల్ చేస్తామని బెదిరింపులకు గురి చేస్తున్నారని యూనివర్సిటీకి ఫీజు కట్టాలంటూ వసూలు చేస్తున్నారని ఇన్ని అక్రమాలు జరుగుతున్నా యూని వర్సిటీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వారు ఆరోపిం చారు. ఫీజు పేరుతో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న కళాశాలలపై యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్‌లు స్పందించి ఫీజు దోపిడిని అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ మెంబర్ మోహన్, యూనివర్సిటీ వైస్ ప్రసిడెంట్ అనిల్, జాయింట్ సెక్రెటరీ సమీర్, అక్షయ్, అశోక్, లెనిన్ పాల్గొన్నారు.

శివనామస్మరణతో మార్మోగుతున్న గ్రామాలు



పడిపూజలో శివ స్వాములు



అల్పాహారం చేస్తున్న స్వాములు



గంగలో స్నానం చేసి పూజలు చేస్తున్న శివ స్వాములు (ఫైల్)

మద్నూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలలో ఎక్కడ చూసినా శివ నామ సర్మరణతో మారుమోగుతుంది. మొన్నటి వరకు అయ్యప్ప దీక్షలతో మళ్లీ ఇప్పుడు శివ స్వాముల దీక్షలతో గ్రామాల్లో భక్తి భావం వెల్లి విరుస్తుంది. యువకులు ముందుకు వచ్చి శివ దీక్షలు తీసుకున్నారు. మండల కాలం స్వామి వారిని పూజిస్తే తమ బాధలు తొలగి శివుని ఆశీస్సులు లభిస్తాయని శివ స్వాముల నమ్మకం. ఏటా మహా శివరాత్రికి ముందు శివ దీక్షలు తీసుకునే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంది. జుక్కల్ నియోజకవర్గంలో వం దలాది మంది వరకు శివ దీక్ష తీసుకున్నారు. మండల కాలం (41) దీక్ష చేస్తే శ్రేష్టమైనదిగా చెబుతున్నప్పటికీ అర్థ మండలం (21) దీక్షతో పాటుగా ముందుగా వేసుకుని భక్తులు 11 రోజుల పాటు శివ దీక్ష తీసుకుంటున్నారు.

● నిబంధనలతో శివదీక్షలు

శివ దీక్షను స్వీకరించిన స్వాములు గోధుమ వర్ణం గల వస్త్రాలను ధరిస్తారు. మగవారు వయస్సుతో సంబంధం లేకుండా ఈ దీక్షను స్వీకరిస్తున్నారు. సూర్యోదయం, సూర్యాస్తమయం సమయంలో చన్నీటితో తలస్నానం ఆచరిస్తున్నారు. ఒక పూట భోజనం చేసి నేలపై నిద్రిస్తూ మత్తు పదార్థాలు, మాంసాహారానికి దూరంగా ఉంటూ వాటిని వదిలిపెట్టి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

● దీక్ష విరమణ

శివరాత్రి నాటికి మండల పూజలు పూర్తి చేసుకుని శివ స్వాములు బయలుదేరే రోజు స్థానిక శివాలయంలో అర్చకులతో జ్యోతిర్ముడి కట్టించుకోవాలి. జ్యోతిర్ముడిని శిరస్సుపై ధరించి అటు శ్రీశైలా నికి ఇటు వేములవాడకు బయలుదేరుతారు. జ్యోతిర్ముడిని విప్పిన తరువాత అందులోని పూజా ద్రవ్యాలను స్వామి పూజకు సమర్పిం చాలి. ముడుపులను హుండీలో వేయాలి. మహా శివరాత్రి రోజున లింగోద్భవ సమయం అనంతరం శ్రీ స్వామి వారికి శివ దీక్ష స్వాములు అభిషేకం చేసి స్థానిక ఆలయంలో అర్చకుల నేతృత్వంలో దీక్ష విరమణ గావిస్తారు.

తాళ్ల రాంపూర్‌లో భారీ మొసలి కలకలం



ఫారెస్ట్ అధికారులు బంధించిన భారీ మొసలి

ఏర్గట్ల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్ల రాంపూర్ గ్రామంలో భారీ మొసలి కలకలం సృష్టించింది. స్థానిక రామ చెరువులో నుంచి శనివారం వేకువ జామున గ్రామంలోని పలు కాలనీల వెంబట సంచరించడంతో ఆ విషయాన్ని కమ్మర్‌పల్లి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించడంతో అక్కడి చెరుకుని వారితో పాటు జిల్లా నుండి వచ్చిన ఫారెస్ట్ అధికారులతో కలిసి భారీ మొసలిని బంధించి పట్టుకొని పై అధికారులకు సమాచారం అందించగా ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో మొసలిని వదిలేసినట్లు స్థానికులు తెలిపారు.

నాగేపూర్ రామాలయంలో మండల పూజ

● పాల్గొన్న హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి



నాగేపూర్‌లో కొలువైన సీతారామ లక్ష్మణ ఆంజనేయ దేవతా మూర్తులు



యజ్ఞంలో పాల్గొన్న హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి

నవీపేట,ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేపూర్‌లోని శ్రీ రామాలయంలో శనివారం మండల పూజ నిర్వహించారు. గత డిసెంబర్ 26న గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించి 41రోజులు అయిన సందర్భంగా మండల పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం, యజ్ఞం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం రాత్రి ఆలయంలో భక్తులకు హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి ప్రవచనలు అందజేశారు.

టీయూలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. తెలంగాణ బడ్జెట్‌లో విశ్వవిద్యాలయానికి 500 కోట్ల రూపాయల నిధులు కేటాయించాలని, ఇంజనీరింగ్ కళాశాలకు వర్సిటీలో శ్రీకారం చుట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిన ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఊసే ఎత్తకపోవడం దారుణమన్నారు. స్కాలర్‌షిప్ ఫీజు, రీయింబర్స్‌మెంట్ విడుదల కాక పోవడంతో విద్యార్థులు భిక్షం ఎత్తుకునే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభు త్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఈ విషయంలో స్పందించకుంటే ఆయన ఇంటిని ముట్టడిస్తామన్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రాజ్ కుమార్, యూనివర్సిటీ అధ్యక్షుడు శివ, ఉపాధ్యక్షుడు పృథ్వి, నాయకులు సంతోష్, నిరంజన్, నాగేంద్ర పాల్గొన్నారు.

ఫొటో న్యూస్



నడిపల్లి సచివాలయం వద్ద కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్



ఇస్లాంపుర వద్ద



ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద..



ఘన్‌పూర్ పాఠశాల వద్ద..

కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లతో ఇబ్బందులు

● మృత్యువాత పడుతున్న మూగజీవాలు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ట్రాన్స్ కో అధికారుల నిర్లక్ష్యం, పంచాయతీ అధికారుల అలసత్వం కారణంగా చేతికందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మ ర్ల గద్దెలను ఏర్పాటు చేసిన వాటి చుట్టూ కంచె లేకపోవడంతో మూగజీవాలు మృత్యు వా త పడుతున్నాయి. గతంలో ఎన్నోమార్లు గ్రామసభల్లో ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఇనుప కంచెలను ఏర్పా టు చేయాలని వినతులు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామీణ ప్రజలు వాపోతున్నారు. విద్యుత్ సర ఫరా కారణంగా విద్యుత్ తీగలు వేలాడుతున్నా ఇప్పటి వరకు ఎన్నోసార్లు మూగజీవాలు వాటికి తగిలి మృత్యువాత పడ్డాయి. ఇప్పటికైనా అధికారులు మేల్కొని పాఠశాల, కళాశాలల వద్ద, పంచాయతీ కార్యాలయాల వద్ద ప్రమాద భరితంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు ఏర్పాటుచేయాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

కొత్త రేషన్‌కార్డు దరఖాస్తుల స్వీకరణకు బ్రేక్

(5వ పేజీ తరువాయి)

వేలల్లో ఉంది. రేషన్ కార్డులు జారీ చేసిన కొత్తలో చిన్నపిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లడంతో వారికి ప్రభుత్వం ద్వారా సహాయం అందుతుండటంతో వారి పేర్లను రేషన్ కార్డులలో చేర్చుకోలేదు. పిల్లలు ఐదేళ్లు నిండిన తర్వాత రేషన్‌కార్డులలో యాడ్ చేస్తుండడంతో కార్డుదారులు వారికి సంబంధించిన పత్రాలు పట్టుకుని కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉంది. కొత్త రేషన్‌కార్డుల జారీని నిలిపివేసిన ప్రభుత్వం కుటుంబ సభ్యులు, పిల్లలను జతపరిచే ప్రక్రియను కూడా ఆలస్యం చేస్తుండడంతో ఆహార భద్రత కార్డుదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. వారికి ఏదైనా ఆరోగ్య సమస్యలు వచ్చినపుడు ఆరోగ్యశ్రీలో వారి పేరు లేక ఆసుపత్రులలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్యాలయాల చుట్టూ తిరిగిన కుటుంబ సభ్యులు, పిల్లలను జతపరిచే ప్రక్రియ జరగకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు.

ఎదురుచూపులు

గతంలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను అందజేస్తామని ప్రకటించినప్పటికీ అది క్షేత్రస్థాయిలో అమలు కాలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలో 2014లో అప్పటి ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే పేరుతో ఒకేరోజు సర్వే నిర్వహించి ఇంటింటి వివరాలను నమోదు చేసుకున్నప్పటికీ రేషన్ కార్డులను మాత్రం ఇవ్వలేదు. 2022లో కొంతమంది లబ్ధిదారులకు రేషన్ కార్డులను జారీచేశారు. అవి కొంతమందికి మాత్రమే ఇచ్చారు. ప్రస్తుతం కుటుంబాలు పెరిగిపోయి విడిగా ఉంటున్న వారు, పెళ్లిళ్లు జరిగి వేరేకాపురం పెట్టిన వారు, కొత్తగా పుట్టిన పిల్లలు, కొంత మంది పిల్లల పేర్లు రేషన్ కార్డులో లేకపోవడం వీటన్నింటికి అవకాశం లేకపోవడంతో ప్రభుత్వ పథకాలను కోల్పోతున్నారు. ఆరు గ్యారంటీల అమలులో రేషన్ కార్డుల కీలకపాత్ర పోషిస్తున్నాయి. రేషన్ కార్డు ఉంటేనే ఆరు గ్యారంటీ స్కీమ్‌లకు అర్హులుగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయి. ప్రజాపాలన దరఖాస్తులతో పాటు ఇటీవల జనవరి 26 సందర్భంగా ప్రారంభించిన నాలుగు గ్యారంటీల అమలులోనూ రేషన్ కార్డులు కీలకపాత్ర పోషిస్తున్నాయి. రేషన్ కార్డు ఉంటేనే ప్రభుత్వ పథకాలకు అర్హులుగా గుర్తిస్తుండటంతో ప్రతి ఒక్కరు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేస్తున్నారు.

నష్టపోతున్న అర్హులు, విద్యార్థులు

ప్రభుత్వం ఆరు గ్యారంటీ స్కీమ్‌లకు రేషన్ కార్డు తప్పనిసరి చేయడంతో చాలా మంది అర్హులు ప్రభుత్వ పథకాలను పొందలేకపోతున్నారు. గతంలో తొమ్మిదన్నర ఏళ్లపాటు కొనసాగిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం రేషన్‌కార్డుల జారీలో నిర్లక్ష్యం చేసింది. కేవలం ఒకసారి మాత్రమే రేషన్ కార్డులను జారీ చేయగా అవి కేవలం కాగితాలకే పరిమితం అయ్యాయి. ఎవరికీ రేషన్‌కార్డులను ఇవ్వలేదు. గత తొమ్మిదేళ్ల కాలంలో అనేక కుటుంబాలలో పిల్లలకు పెళ్లిళ్లు జరిగి వేరే కాపురాలు పెట్టినప్పటికీ వారికి రేషన్ కార్డులు అందలేదు. ఆడపిల్లలకు పెళ్లిళ్లు జరిగి అంతవారి ఇంటికి వెళ్లినప్పటికీ ఇక్కడ పుట్టినింట్లో ఉన్న రేషన్ కార్డులలో పేర్లు తొలగించారు. అత్తవారి ఇంట్లో వారి పేర్లను నమోదు చేయడంలో మాత్రం ఆలస్యం జరుగుతుంది. గత ఐదేళ్లుగా రేషన్ కార్డుల్లో కొత్త వారి పేర్ల నమోదు జరగడం లేదు. విద్యార్థులు ఆదాయ ధృవీకరణ పత్రం, ఇతరత్ర సర్టిఫికెట్లు పొందాలంటే రేషన్ కార్డు తప్పనిసరి కావడంతో వారు కూడా ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు.



టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అదుపులో నిందితుడు, పట్టుకున్న బియ్యం

నిల్వ చేసిన పీడీఎస్ బియ్యం పట్టివేత

ఖిల్లా, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య ఆధ్వర్యంలో సిబ్బంది పట్టుకున్నారు. ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ ఆదేశాల మేరకు ఖచ్చితమైన సమాచారంపై వర్ని పోలీసు స్టేషన్ పరిధిలోని మోస్రా గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. కేసు నమోదుకు చేసుకుని నిందితులను సంబంధిత శాఖాధికారులకు అప్పగించారు.

'మహాధర్నాను జయప్రదం చేయండి'

సుభాష్‌నగర్, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): కేంద్రబడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 10న హైదరాబాద్ ఇందిరాపార్కులో చేపట్టిన ప్రజాసంఘాల మహాధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను చట్టబద్ధం చేసే ఎంఎస్‌పీ చట్టం తెచ్చేదిలేదని, అందుకు అవసరమైన నిధులు కేటాయించబోమని ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్రబడ్జెట్ స్పష్టం చేసిందన్నారు. రైతుల ఆత్మహత్యలను నివారించడానికి రుణ విమోచన చట్టం ప్రకటించలేదన్నారు. మహాధర్నాను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పెద్ది వెంకట్రాములు, వెంకటేశ్, గంగాధర్, నన్నేసాబ్, తదితరులున్నారు.

ట్రాక్టర్లను సీజ్ చేసిన ఫారెస్టు అధికారులు

మోపాల్, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ మోపాల్ మండలం అటవీప్రాంతంలో శుక్రవారం రాత్రి అటవీ భూములను ట్రాక్టర్లతో చదును చేస్తుండగా ఫారెస్టు అధికారులు దాడి చేసి రెండు ట్రాక్టర్లను సీజ్‌చేశారు. అటవీ భూములను రైతులు చదును చేయడం చట్టరిత్యా నేరమని అధికారులు హెచ్చరించారు. అటవీ భూములను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. అటవీ భూములను చదును చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఫారెస్టు అధికారులు పెద్దఎత్తున దాడి చేసి అక్కడున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఇకముందు ఎవరైనా ఫారెస్టు భూములను చదును చేస్తే వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాల్సి వస్తోందని హెచ్చరించారు.

జాతీయ జంబోరి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

సిరికొండ, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని తిరుచ్చిలో జరిగిన జాతీయ జంబోరి పోటీల్లో సిరికొండ విద్యార్థులు ప్రతిభను కనబర్చారు. జనవరి 28 నుంచి ఈనెల 3 వరకు తిరుచ్చిలో సౌట్స్ మరియు గైడ్స్ విద్యార్థుల జాతీయ జంబోరీ పోటీలు నిర్వహించారు. ఈ జంబోరిలో జిల్లా నుంచి సిరికొండకు చెందిన సత్యాశోధక్ పాఠశాలకు చెందిన స్కౌట్స్ గైడ్స్ విద్యార్థులు పాల్గొని అత్యంత ప్రతిభను కనబర్చారని ప్రధానోపాధ్యాయులు ఆర్.నర్సయ్య తెలిపారు.

చెట్టును ఢీకొన్న కారు: నలుగురికి గాయాలు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధర్మారం(బీ) గ్రామ శివారులో శనివారం సాయంత్రం మాధవనగర్‌లో ఓ ఫంక్షన్‌కు వెళ్లి డిచ్‌పల్లి వైపు వస్తున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో కారులో ఉన్న ఇటుక వ్యాపారి రమేష్, మిత్రులు జగన్, గణేష్, నరేష్‌లు నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. కారు ముందుభాగం పూర్తిగా ధ్వంసమైంది. వెంటనే డిచ్‌పల్లి సీఐ మల్లేష్, ఎస్సై షెరీఫ్‌లు ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వీరంతా కోలుకుంటున్నట్లు ఎస్సై తెలిపారు.



చెట్టును ఢీకొన్న కారు

అదనపు కలెక్టర్లను కలిసిన అధికారుల బృందం

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వారం రోజుల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న మిలటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్ ప్రొబెషనరీ అధికారుల బృందం శనివారం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్‌లను కలిశారు. జిల్లాలో శిక్షణ కోసం 30 మంది అధికారులతో కూడిన బృందం వారం క్రితం జిల్లాకు వచ్చింది. వీరిలో ఆరుగురు చొప్పున బృందాలుగా ఏర్పాటు చేస్తూ ఒక్కొక్క బృందాన్ని ఒక్కో గ్రామంలో క్షేత్రస్థాయి అధ్యయనంపై అవకాశం కల్పించారు. మోర్తాడ్ మండలంలోని తిమ్మాపూర్, సుంకేట్, దోన్కల్, నందిపేట మండలం సిద్ధాపూర్, వన్నెల్‌కె, వెల్మల్ గ్రామాల పరిధిలో ఈ ప్రొబెషనరీ అధికారులు బసచేశారు. గ్రామాల్లో అమలవుతున్న పథకాలను పరిశీలించారు. రైతులు వేసిన పంటలను చూడటంతో పాటు సాగు విధానంపై అధ్యయనం చేశారు. మహిళా సంఘాలు, డ్వాక్రా గ్రూపులు, మధ్యాహ్న భోజనం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్, పాల్గొన్న మిలటరీ ఇంజనీరింగ్ సర్వీస్ ప్రొబేషనరీ అధికారులు

అమలవుతున్న తీరు, అంగన్‌వాడి, ఆశావర్కర్లు, ఉపాధిహామీ కూలీలు, వ్యవసాయ కూలీల పనితీరుపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేశారు. జిల్లాలో క్షేత్రస్థాయి అధ్యయనం పూర్తి కావడంతో ట్రైనీ అధికారులు అదనపు కలెక్టర్లను కలిసి వీడ్కోలు తీసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్, విజేందర్‌రెడ్డి, వివిధశాఖల అధికారులున్నారు.

ధర్పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్య మేళా

ధర్పల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో గల 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం ఆరోగ్య మేళా నిర్వహించారు. ఈ ఆరోగ్య మేళాకు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజు, ఎన్‌హెచ్‌ఎం డిస్ట్రిక్ ప్రోగ్రాం ఆఫీసర్ విశాలరాణి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చిన్న పిల్లలకు సంబంధించి వైద్యులు డాక్టర్ శివ శంకర్, జనరల్ మెడిసిన్ డాక్టర్ చంద్రశేఖర్‌లతో వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ మేళాకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి రోగులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. 169మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆరోగ్య మేళాకు బారులు తీరారు. ఆరోగ్య మేళాకు మంచి స్పందన లభించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి మౌనిక, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న లెక్చరర్ ఇంట్లో చోరీ

- 8 తులాల బంగారం, రూ.25వేల నగదు అపహరణ

ఖిల్లా, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 6వ టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో గల ఆటోనగర్‌లో తాళం వేసి ఉన్న ఓ లెక్చరర్ ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి చోరీకి పాల్పడినట్లు 6వ టౌన్ ఎస్సై వెంకట్రావ్ తెలిపారు. ఆటోనగర్‌కు చెందిన ఇలియాస్ విధి నిర్వహణలో భాగంగా శుక్రవారం రాత్రి నైట్ డ్యూటీకి వెళ్లారు. అతని భార్య కుటుంబ సభ్యులను పరామర్శించడానికి ఇంటికి తాళం వేసి వెళ్లింది. దీన్ని గమనించిన గుర్తుతెలియని దుండగులు వెనుక భాగం నుంచి లోనికి వెళ్లి ఇంటి తాళం ధ్వంసం చేశారు. ఇంటిలో గల బీరువాలో ఉన్న బంగారం, నగదును అపహరించారు. శనివారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తాళం ధ్వంసమై ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం మేరకు సౌత్ రూరల్ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఎస్ఐ వెంకట్రావ్ సిబ్బందితో చోరీ జరిగిన ఇంటికి వెళ్లి తనిఖీ చేశారు. సమీపంలో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దుండగుల కోసం గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సాంకేతికత ద్వారా విద్యాబోధనపై ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో సాంకేతికత ద్వారా విద్యాబోధన చేసేందుకు వీలుగా సమగ్ర శిక్షా, ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. నిజామాబాద్ డివిజన్‌కు సంబంధించి నాలుగు కేంద్రాలలో రెండు రోజుల పాటు శిక్షణ నిర్వహించనున్నారు. ప్రతీ మండలం నుంచి సబ్జెక్టుకు ఇద్దరు చొప్పున ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. శనివారం గూపన్‌పల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను డీఈవో అశోక్ సందర్శించి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రపంచానికి దీటుగా ఎదగాలంటే ప్రతీ ఉపాధ్యాయుడు సాంకేతిక ప్రమాణాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. తానే స్వయంగా ఐఎఫ్‌పీపై జియో గ్రోబ్రాన్ ఉపయోగించి విద్యార్థులకు సులువులా అర్థమయ్యేలా ఎలా బోధన చేయాలో వివరించారు. ఆయన వెంట సమగ్ర శిక్షా జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీధర్‌రెడ్డి, ఏఎంవో జీవన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): విద్యారంగానికి వచ్చే బడ్జెట్‌లో 20శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అన్ని రంగాలతో పాటు విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామని విద్యకు బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయిస్తామని ప్రకటించినప్పటికీ గత బడ్జెట్‌లో అంతంత మాత్రంగానే నిధులు కేటాయించారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శంతన్, విజయ్‌కుమార్, జిల్లా స్టీరింగ్ కమిటీ నాయకులు వెనిగళ్ల సురేష్, ఓమాజీ, అరవింద్, సుదాం, రమేష్ పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సీతారాంనగర్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని రాజశ్రీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో మందుల నిల్వలను, టీకాలు నిల్వ చేసే ఫ్రిజ్‌ను, ల్యాబ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బంది అంతా సమయపాలన పాటించాలని రోగులతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. ఫార్మాసిస్టులు ముఖ్యంగా మందుల నిల్వలు ఉండేలా చూస్తూ టీకాలు నిల్వ చేసే ఫ్రిజ్‌లో టెంపరేచర్‌ను రోజూ రికార్డు చేయాలన్నారు. అన్ని ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నవ్య, తదితరులు ఉన్నారు.

ఇందల్వాయిలో బీజేపీ నేతల సంబరాలు

ఇందల్వాయి, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో బీజేపీ పార్టీ విజయం సాధించిన నేపథ్యంలో బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు లోలం సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో బాణాసంచా కాలుస్తూ మిఠాయిలు పంచుతూ సంబరాలు చేసుకున్నారు. గత 27 ఏళ్ల క్రితం ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం ఉండేదని, మళ్లీ ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో మళ్లీ అధికారం చేపట్టడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఒక్క ఎమ్మెల్యే సీటు రాకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. దేశంలోని అధిక రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వం ఉందన్నారు. తెలంగాణలో రాబోయే ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఢిల్లీ తరహా అన్ని మండలాల్లో, గ్రామాల్లో బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లోలం సత్యనారాయణ, శ్రవణ్‌కుమార్, గోపి, కన్నె చిన్ని, పిల్ల శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి

నిజామాబాద్ కల్చరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): భీష్మపితామహుడి ఏకాదశి పురస్కరించుకొని ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో భీష్మపితామహుడి చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు విష్ణు సహస్ర పారాయణం పఠించి భజనలు చేశారు. నగరంలోని శివాజీనగర్‌లో గల గీతా మందిరంలో భీష్మ ఏకాదశిని పురస్క రించుకొని విష్ణు సహస్రనామం, భగవద్గీత పారాయణంతో యజ్ఞం నిర్వహించారు.

శాస్త్రోక్తంగా లక్ష్మీనారసింహ సుదర్శన హోమం

పాడి పంటలతో సంతోషంగా ఉండాలని లోక కల్యాణార్థం పాంచజన్య జ్యోతిష్య ఆల యం ఆధ్వర్యంలో శనివారం శాస్త్రోక్తంగా సుదర్శన హోమం నిర్వహించారు. నగరంలోని నాగారంలో గల లక్ష్మీనారసింహ స్వామి ఆల యంలో వేద పండితులు సముద్రాల శ్రీధరా చార్య ఆధ్వర్యంలో 24 గుండాలతో లక్ష్మీనరసింహ సుదర్శన హోమం సాగింది. సుదర్శన శతకంలోని 100 శ్లోకాలను పఠించగా భక్తులు యజ్ఞ క్రతువును జరిపారు. కార్యక్రమంలో కందాళై వినోద్ కుమార్,



సుదర్శన హోమం చేస్తున్న పండితులు

హయగ్రీవాచార్య, గోవర్ధనం సందీప్‌కుమార్, గోపాలం విష్ణు, వైద్య ప్రవీణ్ కుమార్, భక్తులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులకు యాదగిరి జీవితం ఆదర్శం

సుభాష్‌నగర్, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): కామ్రేడ్ యాదగిరి జీవితం కమ్యూనిస్టులకు ఆదర్శమని సీపీఐఎంఎల్ డివిజన్ కార్యదర్శి వెంకన్న, నగర కార్యదర్శి సుధాకర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎన్ఆర్ భవన్‌లో ఏర్పాటుచేసిన యాదగిరి సంతాపసభకు వారు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆదర్శ కమ్యూనిస్టు నిజాయితీపరుడు ప్రజాపంథ ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేసిన యాదగిరి కమ్యూనిస్టులకు ఆదర్శం అన్నారు. ఆయన మరణం పీడిత ప్రజలకు తీరనిలోటని అన్నారు. జీవితాంతం ఆదర్శంగా నిలిచి మరణించిన అనంతరం శరీరాన్ని, నేత్రాలను దానం చేశారని అన్నారు. జిల్లాలో అనేక ప్రజాఉద్యమాలకు నాయకత్వం వహించి ప్రజలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దారని, ఆయన ఆశయాల సాధనలో ప్రజాఉద్యమాలు నిర్మించడమే యాదగిరికి నిజమైన నివాళులని అన్నారు. కార్యక్రమంలో సాయన్న, ఆల్గోట్ రవీందర్, గోదావరి, సంధ్యారాణి, గణేష్, మురళి, విఠల్, లక్ష్మి, లింగం, సాయిబాబా, గంగాధర్, రవి, నర్సక్క, సునంద, మహి పాల్, గంగన్న, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



డాన్స్ చేస్తున్న బాలికలు

జోరుగా హుషారుగా..!

సిరికొండ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సిరికొండలోని ఆదర్శ పాఠశాలలో శనివారం పదో తరగతి, ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సర విద్యార్థుల వీడ్కోల సమావేశం జోరుగా హుషారుగా సాగింది. విద్యార్థినీలు డ్యాన్స్‌లు అదరగొట్టారు. ప్రిన్సిపాల్ రాజేష్‌రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ త్వరలో జరగనున్న పరీక్షల కోసం ఏకగ్రతతో చదవాలని, భవిష్యత్తుపై ఓ లక్ష్యం పెట్టుకుని చదువుకోవాలని సూచించారు. 2గంటల పాటు ఇంటర్మీడియేట్, పదో తరగతి విద్యార్థుల కోసం వేర్వేరుగా ఏర్పాటు చేసిన స్టేజీలపై విద్యార్థులు డాన్స్‌లు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీసీసీ కార్యవర్గంపై జిల్లా నేతల ఉత్కంఠ

(5వ పేజీ తరువాయి)

కార్యవర్గంలో చోటు ఇవ్వడం లేదు. మిగతా వారికి ఇవ్వనుండటంతో ఉమ్మడి జిల్లాలోని సీనియర్ నేతలకు అవకాశం వస్తుందని భావిస్తున్నారు. గత కార్యవర్గంలో పనిచేస్తూ కార్పొరేషన్ చైర్మన్‌లుగా రాని వారు ఉమ్మడి జిల్లా నుంచి ఉన్నారు. వారికి కూడా కార్యవర్గంలో అవకాశం కల్పించనున్నట్లు తెలుస్తుంది. మొత్తంగా పీసీసీ కార్యవర్గం ఒకటి రెండు రోజుల్లో ప్రకటించనుండటంతో ఉమ్మడి జిల్లా నుంచి తమకు అవకాశం వస్తుందని సీనియర్ నేతలు ఎదురు చూస్తున్నారు.

● ఇద్దరు ఎమ్మెల్యేలకే అధ్యక్ష పదవులు!

ఉమ్మడి జిల్లా పరిధిలో ఇద్దరు ఎమ్మెల్యేలకే జిల్లా అధ్యక్షుల పదవి ఇస్తే ఎలా ఉంటుందనే చర్చ కూడా జరిగినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేలు విముకత వ్యక్తం చేయడంతో బలంగా ఉన్న నియోజకవర్గ ఇన్‌చార్జిలకు ఈ కీలక పదవిని కట్టబెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు పార్టీ నేతల సమాచారం. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న సీనియర్ నేతలు పదేళ్ల పాటు పార్టీ కోసం పనిచేశారు. కార్పొరేషన్ పదవులు రాని వారు పీసీసీ కార్యవర్గంలో చోటు కోసం ఎదురు చూస్తున్నారు. కార్పొరేషన్ చైర్మన్‌ల పదవీకాలం సంవత్సరంన్నరలో పూర్తి కానుండటంతో అప్పటివరకు పీసీసీ కార్యవర్గంలో కొనసాగాలని సిద్ధమవుతున్నారు. జిల్లా పరిధిలో ఈసారి మళ్లీ బలమైన సామాజిక వర్గానికే అధ్యక్ష పదవిని ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. కామారెడ్డి జిల్లా పరిధిలోనూ ఇదే నిర్ణయం తీసుకోనున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర నేతల నుంచి సమాచారం తీసుకోవడంతో పాటు చర్చించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రాష్ట్రస్థాయి కార్యవర్గంలో ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు లేదా ముగ్గురికి చోటు దక్కనున్నట్లు పార్టీ నేతలు తెలిపారు. ఆ పదవులు రాని వారికి జిల్లా అధ్యక్ష పదవులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా వచ్చేవారంలో ఉమ్మడి జిల్లా నుంచి కీలక నేతలకు పార్టీ పదవులు రానున్నాయి.

ఢిల్లీ విజయం మోదీకి అంకితం

(5వ పేజీ తరువాయి)

సాధించడంతో జిల్లాలో బీజేపీ నాయ కులు సంబరాలు చేసుకున్నారు. జిల్లాకేం ద్రంలోని బీజేపీ కార్యాలయంలో కార్య కర్తలు, నాయకులు శనివారం టపాసు లు పేల్చి, నృత్యాలు చేస్తూ సంబరాలు చేసుకున్నారు. అనంతరం ర్యాలీగా వెళ్లి నిఖిల్‌సాయి చౌరస్తా వద్ద మోదీ జిందా బాద్ అంటూ నినాదాలు చేశారు. అనం తరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి మాట్లాడుతూ అవినీతిని అంతం చేస్తామనే నినాదంతో అధికారంలోకి వచ్చిన కేజ్రీవాల్ అధికార దాహంతో లిక్కర్ మాఫియా, అధికార దుర్విని యోగం సహా అనేక అవినీతి చర్యలకు పాల్పడిందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగోళ్ల లక్ష్మీనారాయణ, భూషణ్, శ్రీనివాస్, కృష్ణ, నారాయణ ఉన్నారు.

సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రెండవ శనివారాన్ని దృష్టిలో ఉంచుకొని ట్రాన్స్‌కో ఏఈ గంగారాం ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో సిబ్బంది 132 కేవీ సబ్‌స్టేషన్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు మరమ్మతులు చేశారు. సబ్‌స్టేషన్‌లో పెరిగిన చెట్లను, పిచ్చిమొక్కలను తొలగించి సరఫరాను పునరుద్ధరించారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.180	రూ.250	రూ. 270
వెన్‌కాబ్(కిలో)	రూ.195	రూ.260	రూ. 280

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.87,100	రూ.80,400	రూ.995

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

- స్క్రీన్-1 : సంక్రాంతికి వస్తున్నాం (10.30, 1.30, 4.30, 7.30, 10.30)
- స్క్రీన్-2 : పట్టుదల (10.05, 1.15, 4.25, 7.35, 10.45)
- స్క్రీన్-3 : స్కై ఫోర్స్ (హిందీ) (10.15) : డాకూ మహారాజ్ (1.00, 7.20) : దేవ (హిందీ) (4.05, 10.25)
- స్క్రీన్-4 : దేవ (హిందీ) (10.00, 7.10) : స్కై ఫోర్స్ (హిందీ) (1.15, 10.25) : మద గజ రాజ (4.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

- స్క్రీన్-1 : తండేల్ (1.20, 4.15, 7.15, 10.00)
- స్క్రీన్-2 : తండేల్ (11.00) : సంక్రాంతికి వస్తున్నాం (1.45, 7.30) : సనం తేరీ కసం (హిందీ) (4.30, 10.10)
- స్క్రీన్-3 : పట్టుదల (11.00, 1.40, 4.30, 7.20, 10.10)

- దేవి : పట్టుదల (11.15, 2.15, 6.15, 9.15)
- నటరాజ్ : బాదాస్ రవికుమార్ (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
- విజయ్ : సంక్రాంతికి వస్తున్నాం (11.15, 2.15, 6.15, 9.15)
- లలితామహల్ : తండేల్ (11.30, 2.30, 6.30, 9.30)

- నిజామాబాద్ అర్బన్